కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో..రూపాయల్లో..)టమాటా.13, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 47, పచ్చ కాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 8, క్యారెట్ 21, దొండ 28, గుండుబీన్స్ 105, గింజ చిక్కుడు 45, గోకరకాయ 35, కీర 23, దోసకాయ 18, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 25, చామగడ్డ 35, మొరంగడ్డ 18, కందగడ్డ 75, సొరకాయ 7, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3-4, ముల్లంగి 4-5. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

వారాసిగూడ ఇన్‌స్పెక్టర్‌గా మధుసూదన్‌రెడ్డి



సికింద్రాబాద్: వారాసిగూడ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా అరకల మధుసూదన్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బేగంబజార్ పీఎస్ నుంచి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాల వ్యవస్థను పటిష్ఠం చేస్తామన్నారు.

బేగంపేట డీఐగా శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ



సనత్‌నగర్: బేగంపేట పోలీస్‌స్టేషన్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ (డీఐ)గా జి.శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా బేగంపేట డీఐగా పనిచేసిన మధుసూదన్‌రెడ్డిని వారాసిగూడ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మధురానగర్ ఎస్‌హెచ్‌ఓగా పనిచేస్తున్న జి.శ్రీనివాస్‌ను బేగంపేట డీఐగా నియమిస్తూ పోలీసు కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఘనంగా సబితా ఇంద్రారెడ్డి జన్మదిన వేడుకలు



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో విద్యాశాఖ మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి జన్మదిన వేడుకలను విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. సోమవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర నాయకులు చటారి దశరథ్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. కేక్‌కట్ చేసి విద్యార్థులకు పంచి పెట్టారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు డా.సత్యవతి, రాధ, కవిత పాల్గొన్నారు.

యువతను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ

ఉస్మానియా యూనివర్సిటీ: గత ఎన్నికల సమయంలో యువతకు అనేక ఆశలు చూపిన కాంగ్రెస్ నేడు నిండా ముంచుతోందని బీఆర్‌ఎస్‌వీ నాయకులు బాలెంల అవినాష్ ధ్వజమెత్తారు. సోమవారం ఆయన ఓయూలో మాట్లాడుతూ గత ఎన్నికల్లో మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ యువతను అన్ని విధాలుగా మోసగిస్తోందన్నారు రాజీవ్ యువ వికాస పథకంలో కూడా యువతకు అన్యాయం జరుగుతోందన్నారు.

తల్లీ కూతుళ్ల అదృశ్యం





అడ్డగుట్ట: తల్లీ కూతుళ్ల అదృశ్యమైన ఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నాగరాణి తెలిపిన మేరకు.. లాలాపేటలోని ఘడీ స్కూల్ సమీప ప్రాంతానికి చెందిన బింగి రజిత(31) కూలిపని చేస్తూ జీవనం సాగిస్తోంది. పన్నెండు సంవత్సరాల క్రితం శ్రీనివాస్ అనే వ్యక్తితో రజితకు వివాహం జరిగింది. దంపతుల మనస్పర్ధల కారణంగా పిల్లలతో పాటు రజిత లాలాపేట ఘడీ స్కూల్ సమీపంలోని తల్లి ఇంట్లో ఉంటోంది. గత నెల 19న తన ఏడేళ్ల కూతురిని తీసుకొని ఇంటి నుంచి బయటకు వెళ్లిన రజిత మళ్లీ తిరిగిరాలేదు. దీంతో ఆమె తల్లి బాలమ్మ తెలిసిన వారిని, బంధువులను వాకబు చేసింది. ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది.

యువతి అదృశ్యం

చిలకలగూడ: యువతి అదృశ్యమైన ఘటన చిలకలగూడ ఠాణా పరిధిలో జరిగింది. ఎస్‌ఐ జ్ఞానేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. మెట్టుగూడకు చెందిన స్వాతి (19) నగరంలోని ఓ ప్రైవేటు కాలేజీలో డిగ్రీ చదువుతోంది. ఈనెల 4వ తేది ఉదయం 9.30 గంటలకు బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరలేదు. సన్నిహితులు, బంధుమిత్రులను వాకబు చేసిన ఫలితం లేకపోవడంతో తల్లి సుజాత పోలీసులను ఆశ్రయించింది. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్‌ఐ జ్ఞానేశ్వర్ తెలిపారు.

ఉల్లాసంగా..ఉత్సాహంగా..







సనత్‌నగర్: వేసవి క్రీడా శిబిరాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. గత నెల 27 నుంచి ప్రారంభమైన క్రీడా శిక్షణ శిబిరాలు బాలల్లో ఉత్తేజాన్ని నింపుతున్నాయి. సనత్‌నగర్ లేబర్ వెల్ఫేర్ గ్రౌండ్‌లోని స్పోర్ట్ కాంప్లెక్స్, అమీర్‌పేట స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లతో పాటు క్రీడా మైదానాల్లో కొనసాగుతున్న శిక్షణ శిబిరాలకు హాజరయ్యే చిన్నారులతో కోలాహలంగా మారాయి. వేసవి సెలవుల్లో ఆటపై పట్టు సాధించడంతో పాటు దేహదారుఢ్యం కూడా పెంపొందుతున్న భావనతో తల్లిదండ్రులు సైతం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని తమ పిల్లలను ప్రత్యేక క్రీడా శిబిరాలకు పంపిస్తున్నారు. క్రికెట్, హ్యాండ్‌బాల్, బాస్కెట్‌బాల్, హాకీ, స్కేటింగ్, జిమ్, బ్యాడ్మింటన్, కరాటే, యోగ..ఇలా పలు రకాల ఆటల్లో చిన్నారులు కసరత్తు చేస్తున్నారు. పిల్లల్లోని ఆసక్తి ని గమనించి కోచ్‌లు సైతం తగిన ప్రోత్సాహాన్ని అందించి ఆటలో వారిని రాటుదేలా చేసేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. చాలా మంది జాతీయ స్థాయి క్రీడాకారులు మొదట తమ క్రీడా శిక్షణ పునాది వేసవి శిక్షణ శిబిరాల్లోనే పడడంతో వారిని స్ఫూర్తిగా తీసుకోవాలంటూ కోచ్‌లు చిన్నారుల్లో ఉత్సాహాన్ని రేకెత్తిస్తున్నారు.







కాంగ్రెస్ ద్వారానే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం

ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్



శాంతిర్యాలీలో పాల్గొన్న ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

సికింద్రాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా మాత్రమే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ చెప్పారు. సికింద్రాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్ అధ్యక్షతను నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం సీతాఫల్‌మండి బీఎస్‌ఆర్ గార్డెన్‌లో జరిగింది. ఈ సమావేశానికి రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్‌తోపాటు పార్టీ సికింద్రాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ పర్యవేక్షుడు, మాజీ ఎమ్మెల్యే కే.లక్ష్మారెడ్డి, శంషాబాద్ మాజీ సర్పంచ్ సిద్దేశ్వర్ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. రానున్న జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో అన్ని స్థానాలకు కాంగ్రెస్ పార్టీ చేజిక్కించుకునే విధంగా కార్యకర్తలు, నాయకులు ఇప్పటి నుంచే అప్రమత్తం కావాలన్నారు. ప్ర మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన 6 గ్యారంటీల అమలుతో ప్రజలలో పార్టీ పట్ల సానుభూతి పెరిగిందని చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ గౌడ్, సందీప్ రాజ్, షకీల్, జలందర్ రెడ్డి పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నాం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మోతుకూరి రాంచందర్

రాంగోపాల్‌పేట్: ప్రజలకు మానసిక ఆరోగ్యంపై అవగాహన ఎంతైనా అవసరమని సైకాలజిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ మోతుకూరి రాంచందర్ అన్నారు. అసోసియేషన్ 9 వార్షికోత్సవం సందర్భంగా సూర్య టవర్స్‌లోని లయన్స్ కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగం సంస్థలు సైకాలజీ రంగ ప్రాధాన్యతను గుర్తించి వివిధ రంగాల్లో నియమించడం సంఘం సాధించిన ఘనత అన్నారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు సుధాకర్, ఉమర్‌ఖాన్, నారాయణ్‌రావ కోశాధికారి డాక్టర్ పూజా, నాయకులు రాజు ఆచార్య, అనిత సామెర్ల తదితరులు పాల్గొన్నారు.

దళితులకు మేలు జరిగింది బీఆర్‌ఎస్ పాలనలోనే



కేక్‌కట్ చేస్తున్న నాగరాజు-ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీ: బీఆర్‌ఎస్ పాలనలోనే దళితులకు అన్ని విధాలుగా మేలు జరిగిందని బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి బొల్లు నాగరాజు యాదవ్ అన్నారు. సోమవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట తెలంగాణ తొలి ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ డా.ఎర్రోళ్ల శ్రీనివాస్ జన్మదిన వేడుకల సందర్భంగా నాగరాజుయాదవ్ కేక్‌కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ పాలనలో దళిత బంధు పథకంలో అనేక మందికి ఉపాధి లభించిందన్నారు. రాష్ట్రంలో తిరిగి కేసీఆర్ పాలన రావాలని కోరుకుంటున్నారని అందుకు వరంగల్‌లో జరిగిన సభకు హాజరైన ప్రజలే నిదర్శనమన్నారు. కార్యక్రమంలో నాగరం ప్రశాంత్, నాగేందర్ రావు, నిఖిల్ పటేల్, దేవంశ్, ధీరజ్, లెనిన్, అంజి, శ్రవణ్, క్రాంతి, రవి, శ్రీకాంత్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎంపీ జన్మదిన వేడుకలు



మాజీ ఎంపీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్ కుమార్‌యాదవ్ జన్మదిన వేడుకల్లో కాంగ్రెస్ నేతలు

సనత్‌నగర్: మాజీ ఎంపీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్‌యాదవ్ జన్మదిన వేడుకలు సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ సనత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు ఆర్.నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో సనత్‌నగర్ బస్టాండ్‌లో జరిగిన ఈ వేడుకలకు తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్‌యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నుంచి అంజన్ కుమార్‌యాదవ్‌ను ఎంపీగా గెలిపించిన సమయంలో చేసిన అభివృద్ధే కనిపిస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఆయూబ్‌ఖాన్, నాయకులు రమేష్, కమల్, వేణుగౌడ్, శ్రీకాంత్, జహంగీర్, మున్నా, టోనీ, కృపానంద్, గిరి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా స్విమ్మింగ్ పూల్



అమీర్‌పేట గురుగోవింద్‌సింగ్ కాంప్లెక్స్‌లోని ఈత కొలను

అమీర్‌పేట: వేసవి తాపం నుండి ఉపశమనం పొందాలనుకునే వారికి నిరాశే మిగులుతోంది. అమీర్‌పేట ఈతకొలనుకు సరిపడా నీటిని సమకూర్చే విషయంలో మున్సిపల్ అధికారులు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.ఫలితంగా ఈత కొలను నిరుపయోగంగా మారిపోయింది. నగరంలోని ఇతర ప్రాంతాల్లో ఉన్న ఈత కొలనులు నెల రోజుల నుండి ప్రజలకు అందుబాటులోకి వచ్చినప్పటికీ అమీర్‌పేటలో మాత్రం ఇప్పట్లో ప్రారంభమయ్యేలా కనిపించడం లేదు. అధికారుల మధ్య సమన్వయం లోపం వల్లే సమస్య నెలకొందని పలువురు పేర్కొంటున్నారు. ఈత కొలను పూర్తిగా నింపాలంటే దాదాపు 80 ట్యాంకర్ల నీరు అవసర పడుతుంది. గురుగోవింద్ సింగ్ మున్సిపల్ కాంప్లెక్స్‌లో ఉన్న అన్ని బోర్లు అడుగంటి పోవడంతో జలమండలి ద్వారా వచ్చే నీటిపైనే ఆధారపడాల్సిన పరిస్థితి.అయితే జీహెచ్‌ఎంసీ అధికారులు నీటి కోసం జలమండలి అధికారులకు సకాలంలో ఇండెంట్ పెట్టడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభించేనాటికి కూడా నీటి కోసం జలమండలికి ఇండెంట్ పెట్టకపోవడం గమనార్హం. దీనిపై సంబంధిత అధికారులను ఆరా తీయగా నెల రోజుల క్రితమే నీరు కావాలని జలమండలి అధికారులకే లేఖ రాశామని,నీటి ఎద్దడి ఉన్న కారణంగా ఒకే సారి నీటి ట్యాంకర్లు సరఫరా చేయలేమని అంటున్నారని తెలిపారు. జీహెచ్‌ఎంసీ కమీషనర్, జలమండలి ఎండీ చొరవతీసుకుంటేతప్ప సమస్య పరిష్కారం అయ్యేలా కనిపించడం లేదని రెండు విభాగాలకు చెందిన కిందిస్థాయి అధికారులు అంటున్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని

సనత్‌నగర్: ఆడబిడ్డ పెళ్లికి ఆర్థిక సహాయం అందించిన మొట్టమొదటి రాష్ట్రం తెలంగాణ సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో 38 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అర్హులైన వారు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, మహేశ్వరి, కుర్మ హేమలత, మాజీ కార్పొరేటర్లు శేషుకుమారి, మల్లికార్జున్‌గౌడ్ పాల్గొన్నారు.

తోట శ్రీనివాస్‌కు ఓయూ డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థి తోట శ్రీనివాస్‌కు పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. సీనియర్ అధ్యాపకులు ప్రొ.సతీష్ కుమార్, ప్రొ.కృష్ణవేణి పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రామకృష్ణాపూర్‌కు చెందిన సింగరేణి కార్మికుడు తోట సదానందనం, విజయలక్ష్మీ దంపతుల కుమారుడైన శ్రీనివాస్‌కు ఓయూ పీహెచ్‌డీ డాక్టరేట్ లభించడం పట్ల పలువురు కార్మికులు అభినందించారు.

కేంద్రం నిధులతోనే కంటోన్మెంట్ అభివృద్ధి

రసూల్‌పురా: రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కంటోన్మెంట్ అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా విడుదల చేయకపోవడం సిగ్గుచేటని బీజేపీ కంటోన్మెంట్ 2వవార్డు అధ్యక్షులు ఎం. శ్రవణ్‌కుమార్ విమర్శించారు. తెలంగాణ అభివృద్ధిలో భాగంగా రహదారులు మౌళిక సదుపాయల కల్పనలో భాగంగా నగరంలో వివిధ ప్రాజెక్టులకు భూమిపూజ కార్యక్రమానికి హాజరైన కేంద్ర రోడ్డు రవాణా జాతీయ రహదారుల మంత్రి నితిన్‌గడ్కరి కార్యక్రమానికి కంటోన్మెంట్ 2.3 వార్డుల నుంచి అధ్యక్షులు మందుల శ్రవణ్, అరుణ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కార్యకర్తలు బస్సుల్లో వెళ్ళారు. ఈ సందర్భంగా శ్రవణ్ మాట్లాడుతూ కంటోన్మెంట్ నియోజకవర్గంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి సంవత్సరంన్నర పూర్తయినా ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు.

అవినీతి సిబ్బందిపై చర్యలు తీసుకోండి

సనత్‌నగర్: అవినీతిని ప్రోత్సహిస్తూ జీహెచ్‌ఎంసీ ఆదాయానికి టౌన్‌ప్లానింగ్ విభాగంలోని కొందరు సిబ్బంది భారీగా గండి కొడుతున్నారని బేగంపేటకు చెందిన దళిత చైతన్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పిడి నవీన్‌కుమార్ మాదిగ ఆరోపించారు. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ నూతన కమిషనర్ ఆర్‌వీ కర్ణన్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్, బేగంపేట సర్కిళ్ల టౌన్‌ప్లానింగ్‌లో కొందరు సిబ్బంది అవినీతికి హద్దు లేకుండా పోయిందన్నారు. ఈ కారణంగానే అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయన్నారు. రాంగోపాల్‌పేట, మోండా, బన్సీలాల్‌పేట, బేగంపేటలలో సీతాఫల్‌మండి, బౌద్ధనగర్, మెట్టుగూడ, తార్నాక ప్రాంతాల్లో అనుమతికి మించి అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



కూలగొట్టిన అక్రమ నిర్మాణాలు

రాంగోపాల్‌పేట్: రెజిమెంటల్‌బజార్‌లో అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. రెజిమెంటల్‌బజార్‌లోని హిల్ స్ట్రీట్ పాఠశాల ఎదురుగా ఓ వ్యక్తి ఐదంతస్తుల భవనాన్ని నిర్మించాడు. కేవలం రెండు అంతస్తుల నిర్మాణాలకు అనుమతులు తీసుకుని అదనంగా మూడు అంతస్తుల అక్రమంగా నిర్మించారు. దీనిపై స్థానికులు పలుమార్లు ఫిర్యాదులు చేశారు. టౌన్ ప్లానింగ్ డీసీపీ సుష్మిత ఆధ్వర్యంలో అక్రమనిర్మాణాలు తొలగించారు. అక్రమ నిర్మాణాల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని ఆమె హెచ్చరించారు.

వేతనాలు చెల్లించాలని ధర్నా

లక్డీకాపూల్ : వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ నిమ్స్ కాంట్రాక్ట్ సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ అధ్యక్షుడు వెంకటేశ్ ఆధ్వర్యంలో సెక్యూరిటీ గార్డులు సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి ఎం. పావని మాట్లాడుతూ.. జీతాలు చెల్లించడంలో ఓపీడీఎస్ కాంట్రాక్టు సంస్థ, నిమ్స్ యాజమాన్యం తీవ్రంగా నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. జీతాలు సమయానికి ఇవ్వకపోతే తాము ఎలా బతకాలని ఆవేదన వ్యక్తం చేశారు. సత్వరమే వేతనాలు చెల్లించాలని లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా పలువురు యూనియన్ నాయకులు యాజమాన్యంతో చర్చలు జరిపి వారికి న్యాయం చేయాలని కోరారు.

షారోన్ చర్చిలో సమ్మర్ క్యాంప్ షురూ

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఎమ్మెల్యే కాలనీ షారోన్ ఫుల్ గాస్పెల్ చర్చిలో యేటా నిర్వహించే సమ్మర్ క్యాంపు సోమవారం ప్రారంభమైంది. వీబీఎస్ (ఒకేషనల్ బైబిల్ స్కూల్) పేరిట 3 రోజుల పాటు కొనసాగే శిబిరంలో ప్రైమరీ స్కూళ్లకు చెందిన 200 మంది విద్యార్థులు చిత్రలేఖనం, పాటలు, ఆటలు, డ్యాన్స్‌తో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నేర్చుకుంటారని పాస్టర్ ఎం. ప్రభుదాస్ తెలిపారు.

ముగిసిన బాస్కెట్‌బాల్ పోటీలు

శ్రీనగర్‌కాలనీ: బిస్పోర్ట్ ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్‌లో సోమవారం నిర్వహించిన బాస్కెట్‌బాల్ అండర్-13, అండర్-16 విభాగాల్లో బాలురు, బాలికలు సత్తా చాటారు. ప్రతిభ చూపిన క్రీడాకారులకు నేషనల్ బాస్కెట్‌బాల్ చాంపియన్ విశాల్‌కుమార్, బిస్పోర్ట్ ఎండీ వెంకటరామిరెడ్డి, ప్రొఫెషనల్ బాస్కెట్‌బాల్ ప్లేయర్ దినేశ్‌కుమార్ బహుమతులు అందించి అభినందించారు.